


బెల్లంపల్లి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీలో బతుకమ్మతో మహిళలు




ఇంతులు ఆడగా.. బతుకమ్మ మురవగా..

సద్దుల బతుకమ్మ వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగుల రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం బతుకమ్మ పాటలు, డీజే చప్పుళ్లతో మహిళలు, యువతులు, చిన్నారులు కోలాటాలు, చప్పట్లతో ఆడి పాడారు. పలు చోట్ల బతుకమ్మలను వినూత్నంగా ఏర్పాటు చేయగా స్థానికులు చిత్రాలు దిగేందుకు ఆసక్తి చూపారు. - న్యూస్‌టుడే, బృందం

మందమర్రిలో బతుకమ్మతో చిన్నారి

చెన్నూరులో చెక్కిన బతుకమ్మతో యువతి



లింగం ఆకారంలోని బతుకమ్మతో యువతి

చెన్నూరు పట్టణంలోని సీతారాంతోట ప్రాంతంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరెన్సీ నోట్లతో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అలంకరణ



ధనలక్ష్మి దుర్గాదేవి

ధనలక్ష్మి అవతారంలో దుర్గాదేవి

దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. బెల్లంపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని రూ.59,99,600 నోట్లతో అలంకరించారు. రూ.10 మొదలు రూ.500 నోట్లతో చూడముచ్చటగా అలంకరించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మేడి పున్నం చంద్రం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రేణికుంట్ల శ్రీనివాస్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే బెల్లంపల్లి పట్టణం

గ్యాస్ రాయితీ.. రాలేదేమి?

మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే వంటగ్యాస్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద దరఖాస్తు చేస్తున్న వారిలో చాలామందికి రాయితీ డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు.



చెన్నూరు గ్రామీణం, ఏసీసీ న్యూస్‌టుడే

జిల్లాలో 2.41 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రూ.500 గ్యాస్ కోసం 2,13,037 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సెప్టెంబరు 17 వరకు 1.17 లక్షల మంది లబ్ధిదారులు 2.59 లక్షల సిలిండర్లను తీసుకోగా రూ.7.68 కోట్ల రాయితీ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేశారు. గ్యాస్ సిలిండర్ తీసుకున్న తర్వాత వారం రోజుల్లో రాయితీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావాలి. కానీ చాలా మందికి పథకం ప్రారంభమైనప్పటి నుంచి రాయితీ డబ్బులు అందడం లేదు.

సవరించినా ప్రయోజనం లేకపాయె..

సమయం తక్కువగా ఉండటంతో ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆపరేటర్లు ఇష్టానుసారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్హులందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పురపాలిక, మండల పరిషత్తు కార్యాలయాల్లో ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు అవకాశం కల్పించారు. దీంతో మహాలక్ష్మి పథకం అర్హులు కార్యాలయాలకు వెళ్లి దగ్గర నుంచి తిరిగి సవరణలు చేయించారు. అయినప్పటికీ రాయితీ వారి ఖాతాల్లో జమ కావడం లేదు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు




చెన్నూరు మండలంలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు(పాత చిత్రం)

కొందరికి కొద్ది నెలలే జమ

మహాలక్ష్మి పథకం ప్రారంభంలో కొందరికి రెండు, మూడు నెలలపాటు రాయితీ డబ్బులు ఖాతాల్లో జమ చేశారు. ఆ తర్వాత వారి ఖాతాలకు కూడా నగదు జమ కావడం లేదు. మహాలక్ష్మి పథకంలో రూ.500కే వంటగ్యాస్ సిలిండరు అందించేందుకు లబ్ధిదారులుగా ఎంపికైనట్లు ప్రభుత్వం నుంచి వచ్చిన లేఖలను పురపాలిక, పంచాయతీల అధికారులు చాలా మందికి అందిస్తున్నారు. ఏదైతే ఎన్ని సిలిండర్లు వాడుతున్నారో అందులో పేర్కొన్నారు. రాయితీ డబ్బులు ఆన్‌లైన్ ద్వారా ఖాతాల్లో జమ చేస్తామని లేఖలో ఉంది. కానీ చాలా మందికి గ్యాస్ రాయితీ డబ్బులు జమ కావడం లేదు.

పనిచేయని ఫోన్ నెంబర్లు

గ్యాస్ సిలిండర్ అందిన తర్వాత రాయితీ నగదు బ్యాంకు ఖాతాల్లో నాలుగు రోజుల్లో జమ చేయడంలో జాప్యం జరిగితే **1967, 18004250033** ఫోన్ నెంబర్లను సంప్రదించాలని లేఖలో సూచించారు. ఈ విషయంలో లబ్ధిదారులు ఆ రెండు నెంబర్లకు ఫోన్ చేసినా ఎప్పుడూ బిజీ అనే వస్తోందని వాపోతున్నారు.



ఒక్కసారి మాత్రమే రాయితీ డబ్బులు వచ్చాయి

- కె.శ్రీనివాస్‌రెడ్డి, సాయినగర్, కిష్టంపేట

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన అనంతరం మార్చి నెలలో గ్యాస్ సిలిండర్ బుక్ చేయగా రాయితీ డబ్బులు ఖాతాలో జమ అయ్యాయి. మళ్లీ రెండుసార్లు గ్యాస్ సిలిండర్లు తీసుకున్నా రాయితీ నగదు మాత్రం బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. దీనిపై ఎవరిని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు.




ధ్రువపత్రం ఇచ్చినా జమ కావడం లేదు

- వేయికండ్ల వెంకటి, చెన్నూరు

రూ.500కే రాయితీ గ్యాస్ సిలిండర్ పొందేందుకు లబ్ధిదారుడిగా ఎంపికైనట్లు ఇటీవల పురపాలిక కార్యాలయం నుంచి ధ్రువపత్రం అందజేశారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి పలుమార్లు గ్యాస్ సిలిండర్ తీసుకున్నాను. గ్యాస్ రాయితీ డబ్బులు మాత్రం ఖాతాలో జమ కావడం లేదు.

ఆటే శ్వాస.. ధ్యాస!



- రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి అవకాశం దక్కించుకున్న తొలి క్రికెటర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ కాలం కుర్రాళ్లంటే స్మార్ట్‌ఫోన్లు, సరదాలు, స్నేహితులు, షికార్లు ఉంటాయి. కానీ ఆ యువకుడికి మాత్రం మైదానమే లోకం. క్రికెట్ బ్యాట్, బాల్, స్టంప్స్, గ్లౌవ్స్, అతడి నేస్తాలు. ఆస్వాదించే వయసులో అన్నింటిని వదిలేసి.. లక్ష్యం వైపే ఏకాగ్రతను కేంద్రీకరించాడు. 12 ఏళ్లు మైదానంలో శ్రమించి కలను నిజం చేసుకున్నాడు. బీసీసీఐ నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ జట్టు సభ్యుడిగా శుక్రవారం జింఖానా మైదానం(హైదరాబాద్)లో అరంగేట్రం చేయనున్నాడు. అతడే కొడిమెల హిమతేజ. కష్టపడితే ఏ రంగంలోనైనా విజయం వరిస్తుందని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

క్రికెట్ మెరుపుల్లో కొన్ని...

- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2013లో కశ్మీర్‌లో అండర్-14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు అర్ధ సెంచరీలు.
- 2017లో అండర్-16, 2019లో అండర్-19 హెచ్‌సీఏ పోటీల్లో పరుగుల వర్షం కురిపించాడు.
- 2023లో అండర్-23 సీకె.నాయుడు స్మారక పోటీలకు హైదరాబాద్ జట్టు సారథిగా ఎంపిక. పోటీల్లో అత్యధిక పరుగులు చేసి నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) గుజరాత్ శిక్షణ శిబిరానికి ఎంపిక.
- 2023లో హెచ్‌జీఏ - న్యూజిలాండ్-ఎ జట్ల పోరులో 49 బంతుల్లో 85 పరుగులు.
- 2024లో బుచ్చిబాబు స్మారక పోటీల్లో ప్రతిభ కనబరిచి రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపిక.

చదువులో, క్రికెట్‌లో మేటి..

ఆదిలాబాద్‌కు చెందిన కొడిమెల మధుసూదన్-కామేశ్వరి దంపతుల కుమారుడు హిమతేజ. చిన్నప్పటి నుంచి చదువులో, క్రికెట్‌లో మేటి. పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. బాబాయ్ వేణుతో కలిసి గల్లీలో ఎడమచేతితో ఆడడం, గంటల తరబడి ఔట్ కాకుండా ఉండటంతో ఆయనను జేసీ క్రికెట్ అకాడమీలో చేర్పించారు. సరైన వసతులు లేకున్నా సాధన చేశాడు. ఉమ్మడి జిల్లా నుంచి రంజీ ట్రోఫీ పోటీలకు తొలి క్రికెటర్‌గా ఎంపికయ్యాడు.

ఈ ప్రయాణంలో ఎన్నింటినో త్యాగం చేశాడు

- మధుసూదన్-కామేశ్వరి, తల్లిదండ్రులు

హిమతేజ రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. ఈ క్రికెట్ ప్రయాణంలో మా బాబు ఎన్నింటినో త్యాగం చేశాడు. మేము మా బాబుతో గడిపింది చాలా తక్కువే. క్రీడా భవిష్యత్తు గురించి ఆలోచించి ప్రోత్సహించాం. ఎప్పుడూ చూసినా మైదానంలో సాధన చేసే హిమతేజను కలవాలంటే రాత్రి వేళల్లో మాత్రమే సాధ్యమయ్యేది. అది కూడా రెండు గంటలే మాట్లాడుకునేవాళ్లం.

భారత జట్టుకు ఆడటమే నా కల..

- హిమతేజ

రంజీ ట్రోఫీ పోటీలకు హైదరాబాద్ జట్టుకు ఎంపిక అయ్యానన్న విషయం ఇప్పటికీ కలగానే అనిపిస్తుంది. ఇదే స్ఫూర్తిని కనబరిచి రంజీ ట్రోఫీ పోటీల్లో రాణిస్తా. భారత జట్టుకు ఎంపికే లక్ష్యంగా పెట్టుకున్నా. రంజీకి ఎంపిక కావడంతో ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కింది.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపికైన ఉపాధ్యాయులు

ఒక్కొక్కరు అయిదుగురు విద్యార్థులను దత్తత తీసుకోవాలి: కలెక్టర్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో డీఎస్సీ 2024లో నియామకమైన ఉపాధ్యాయులతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవముందని, విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించేది ఉపాధ్యాయులే అన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయా కేటగిరీల్లో నియామక పత్రాలు అందుకున్నవారికి పాఠశాలల కేటాయింపు ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో ఉపాధ్యాయుడు వెనుకబడిన అయిదుగురు విద్యార్థులను దత్తత తీసుకొని వారి అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఈవో యాదయ్య, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎంపికైన ఉపాధ్యాయులు వివరాలు సమర్పించాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ-2024లో ఎంపికై ఈ నెల 9న హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న రిపోర్ట్ చేయని వారంతా శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో తప్పనిసరిగా తమ వివరాలు అందించాలని పేర్కొన్నారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ

ఏసీసీ, న్యూస్‌టుడే: పలు ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు కార్యాలయ పర్యవేక్షకులు కోటేశ్వర్ గురువారం పేర్కొన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్-9, సివిల్ అసిస్టెంట్ సర్జన్-1, పోస్టులున్నట్లు తెలిపారు.

సన్నాల కొనుగోలులో సాంకేతికత

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సన్న రకాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సన్న రకాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాల సాగు ఎక్కువగా ఉండటంతో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు.

- ప్రత్యేక పరికరంతో గుర్తింపు



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో వాటి సేకరణలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యతతో పాటు సన్నరకాలను సాగు చేసే రైతుల నుంచి ధాన్యం గుర్తించేందుకు సాంకేతికతను పాటించనున్నారు. ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. జిల్లాల వారీగా అక్కడి నేల, వాతావరణం, సాగు నీటి సౌకర్యం తదితర వాటి మేరకు మంచిర్యాల జిల్లాలో 1008, సాయిరాం, చిట్టిపొట్టి రకాలు, నిర్మల్ జిల్లాలో జైశ్రీరాం, సూపర్‌అమాన్, హెచ్‌ఎంటి రకాలు సాగు చేస్తుండగా, కుమురం భీం జిల్లాలో శ్రీ101, జైశ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు సాగు చేస్తున్నారు. వీటిని గుర్తించేందుకు ఈ సీజన్‌లో గ్రెయిన్‌కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. కేంద్రానికి రెండు పరికరాల చొప్పున ఇవ్వనున్నారు. ఈ యంత్రంతో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు. ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నా.. కొనుగోలు చేసిన తర్వాత సంచులను సులువుగా గుర్తించేందుకు సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.



గ్రెయిన్‌కాలిపర్

నిర్ధారణే సమస్య

వరి ధాన్యం సేకరణలో సన్నధాన్యం నిర్ధారణే సమస్యగా ఉంది. నిబంధనల మేరకు బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మి.మీలకు మించకుండా, పొడవు, వెడల్పు నిష్పత్తి, 2.5 కన్నా ఎక్కువ ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నాణ్యత పరీక్ష కోసం పొట్టు తీసిన గింజలను తేమ శాతం 17 శాతం కన్నా తక్కువ ఉన్న పరిస్థితుల్లోనే నిర్ధారించాలి. ఇప్పటి వరకు కేంద్రం ఏ, బీ రకాలంటూ మద్దతు ధరలను ప్రకటించింది. సన్న రకాలను ప్రభుత్వం సేకరించేది కాదు. మార్కెట్లో ధర తక్కువగా ఉంటే దొడ్డు రకాల మాదిరిగానే సన్న రకాలను రైతులు విక్రయించుకునే పరిస్థితి ఉండేది. ఈ సీజన్‌లో తొలిసారి సన్నరకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

Rc.No.1796/PLG/2024 తెలంగాణ ప్రభుత్వం Date: 10-10-2024

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయము- నిర్మల్ జిల్లా

GENERAL NURSING & MIDWIFERY (GNM) 3 yrs ADMISSION NOTIFICATION 2024-25 డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ హైదరాబాద్ వారి Rc.No. 17944/N1/2024, తేది 28-09-2024 ప్రకారం 2024-25 సంవత్సరం కొరకు తెలంగాణ ప్రభుత్వంచే గుర్తించబడిన నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్, నిర్మల్ నందు జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ 3 సంవత్సరముల (GNM స్టాఫ్ నర్స్) కోర్సుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

నర్సింగ్ స్కూల్ పేరు	కోర్సు	విద్యార్హత	మొత్తం సీట్లు	ప్రభుత్వకోట	మేనేజ్మెంట్ కోట
నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్	GNM 3 Yrs	ఇంటర్ ఏదైనా గ్రూప్	60	36	24

ఇందిరానగర్, నిర్మల్, సెల్: 9505209200, 7337553556, 9010092333

దరఖాస్తు చేయు విధానం: దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా దాఖలు చేయుటకు చివరి తేది 17.10.2024 వరకు చేసుకోవలెను. ఆన్లైన్ ద్వారా నింపిన దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకొని మరియు మీ యొక్క సంబంధిత, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతపరిచి 19.10.2024 సాయంత్రం 5 గంటల వరకు DM & HO గారి Office నిర్మల్ నందు లేదా నాగార్జున స్కూల్ ఆఫ్ నర్సింగ్ నిర్మల్ నందు సమర్పించవలెను. వెబ్‌సైట్ అడ్రస్: http://dme.telangana.gov.in రూ.300/-ల చాలన్ ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఈ క్రింద చూపబడిన హెడ్ ఆఫ్ అకౌంట్ కు 17-10-2024 వరకు జమ చేసి దరఖాస్తులతో పాటు సమర్పించవలెను.

0210 - Medical & Public Health
MH 105- Allopathy
001 Other receipts,


03- Medical Education Training & Research
SH (81)- Other receipts,
DDO Code is 25000902022

గమనిక: 1. లాంగ్వేజ్ మినహా గ్రూప్ సబ్జెక్టులలో అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా కేవలం మెరిట్ మీద మాత్రమే ఎంపిక చేయబడును. 2. మెరిట్ నిర్వహించేటప్పుడు కంపార్ట్మెంట్ లో ఉత్తీర్ణులైన వారి కంటే రెగ్యులర్‌గా పాసైన వారిని పరిగణలోకి తీసుకోబడును. మరియు ఈ సంవత్సరంలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైన వారిని మొదటి ప్రాధాన్యతగా తీసుకొనబడును. 3. ప్రభుత్వ కోటా సీట్లను జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేయబడును, మరియు మేనేజ్‌మెంట్ కోటా సీట్లను సంబంధిత ఇనిస్టిట్యూషన్ వారు ఎంపిక చేయబడును. 4. సంబంధించిన డాక్యుమెంట్లు, ధృవీకరణ కాపీలు లేకుండా దాఖలు చేసిన అసంపూర్తి దరఖాస్తులు అంగీకరించబడవు. 5. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వంచే జారీ చేయబడిన కుల మరియు ఈ సంవత్సర ఆదాయ ధృవీకరణ పత్రములను జతపర్చవలెను. 6. తెలంగాణ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడుతాయి. 7. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మరియు ఓబీసీ కులాల అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు.

సం/- డి.యం. & హెచ్.ఓ.,
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయము, నిర్మల్.



ఒక్కటిగా సీతాకోక చిలుకలు



చూడముచ్చటగా..


అపురూపం.. సీతాకోక చిలుకల అందం

● బుగ్గ ఆలయ సమీపంలో పార్కు ఏర్పాటుకు చర్యలు

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట సెక్షన్ పరిధి బుగ్గ ఆలయం సమీపంలో సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక సీతాకోక చిలుకలను గుర్తించినట్లు చెప్పారు. అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న ఆలయాలు, పురాతన నిర్మాణాల ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో రంగురంగుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చేవారు వీటిని చూస్తూ మురిసిపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్‌ను సంప్రదించగా 'బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారు బుగ్గ ఆలయం రెండు గుట్టల నడుమ 2 వేల ఏళ్ల కిందట వెలిసిందని పూర్వీకులు చెబుతున్నారు. దీన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు అనువైన వనరులు ఉన్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటునకు ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని తెలిపారు. - న్యూస్‌టుడే, కాసిపేట



ఆకట్టుకునేలా..



నీటకుంట వద్ద గుంపులుగా..

మహాగౌరి అవతారం.. పులకించిన భక్తజనం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



మహాగౌరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు మహాగౌరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొగుటా మాదవనంద సరస్వతీ స్వామి దర్శించుకొని పూజలు చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు వీణ వాయించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు.

అవును అవి అవసరమే..!!

● వృత్తులు.. పద్ధతులు పిల్లలకు తెలిసుండాలి

మామడ, న్యూస్‌టుడే: చదువుల నిమిత్తం పిల్లలు చిన్నప్పటి నుంచే వసతిగృహాల్లో ఉంటున్నారు. సెలవులొచ్చినా ప్రత్యేక తరగతుల పేరిట అక్కడే ఉండిపోతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు సొంతూరుకొచ్చినా తల్లిదండ్రుల పని ఒత్తిడి వల్ల వారితో గడపలేకపోతున్నారు. అమ్మానాన్నలతో పిల్లలకు ఉండాల్సిన ఆత్మీయతలో అంతరం కనిపిస్తోంది. పండగల వేళ, ఇతర సమయాల్లో ఇంటికొచ్చినప్పుడు వాళ్లతో ఎక్కువ సమయం గడపడం, తల్లిదండ్రుల వృత్తి, ఉద్యోగాల్లో అవగాహన కల్పించడం వంటివి ఎంతో అవసరం..

ఇదే కదా ప్రధానమని..

నిర్మల్‌లో నివాసముండే మన్మోహన్‌రెడ్డి స్వగ్రామం సారంగాపూర్ మండలం చించోలి. సొంతూరులో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. వారికి ఇతర వ్యాపారాలున్నా సాగుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. తమ ఉన్నతిలో వ్యవసాయానిదే ప్రధాన పాత్ర అని చెప్పే మన్మోహన్‌రెడ్డి సెలవుల్లో కుమారుడు కుషిల్‌రెడ్డిని చేనుకు తీసుకెళ్తారు. సాగు విధానాన్ని చెబుతుంటారు. తోటకు తీసుకెళ్లి ఆవులు, ఇతర జీవాలతో సాగుకు ఉన్న అనుబంధాన్ని ఓ పాఠంలా వివరిస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఆ చిన్నాడికి ఇప్పటి నుంచే చేనుచెలకలపై ఆసక్తి పెరిగింది.



చేనులో తండ్రి మన్మోహన్‌రెడ్డితో కుషిల్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

మామడ మండలం గాయిద్‌పల్లికి చెందిన రమేష్ రాథోడ్ ఉత్తరాఖండ్‌లోని ఓఎన్‌జీసీ ఫైనాన్స్ విభాగంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు దనుష్ ఐఐటీ గువహటిలో బీటెక్, కుమార్తె ఈశిత డెహ్రాడూన్‌లో పదో తరగతి చదువుతున్నారు. వీలున్నప్పుడల్లా సొంతూరుకు వెళ్తాం.. ప్రకృతిలో గడిపేందుకు ఆసక్తి చూపిస్తాం. మా సంప్రదాయ వస్త్రధారణను పిల్లలు ఇష్టపడేలా చూస్తాం. చేలకు తీసుకెళ్లి పంటల సాగుపైనా అవగాహన కల్పిస్తామని తల్లిదండ్రులు రమేష్-రూప సొంతూరిపై మమకారాన్ని, పిల్లలకు మూలాలు తెలియజేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.



సెలవులకు సొంతూరుకొచ్చినప్పుడు పిల్లలతో రమేష్ రాథోడ్-రూప దంపతులు

పనులన్నీ రావాలి కదా..

నిర్మల్ పట్టణం గాయిద్‌పల్లికి చెందిన రవీందర్-నీల దంపతుల పెద్ద కూతురు హిమబిందు ప్రయాగ్‌రాజ్ ట్రిపుల్ ఐటీలో, చిన్న కూతురు సింధూజ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి వసతిగృహాల్లో ఉంటున్నారు.. సెలవులకు ఇంటికొస్తే వారి పనులు వారు చేసుకునేలా చూస్తుంటామన్నారు తల్లి నీల. వంటలు, ఇతర పనులు నేర్చుకునేలా ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. అన్ని పనులు తమకు కూడా ఆనందమే కదా అంటుంటారు ఆ పిల్లలు.



కూతురు సింధూజతో వంట చేయిస్తున్న తల్లి నీల

వృత్తిపై అవగాహన ఉండాలని..

మామడ మండలం దిమ్మదుర్తికి చెందిన రేవెల్లి శ్రీనివాస్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ వృత్తిరీత్యా గీత కార్మికులు. ఊళ్లోని తాటి చెట్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలు అమృత్‌గౌడ్, మనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నారు. దసరా సెలవులకు ఇంటికొచ్చిన ఆ ఇద్దరిని తాటి వనానికి తీసుకెళ్లి నిత్యం వారు చేసే పనిని ప్రత్యక్షంగా చూపించడం, తాతల కాలం నుంచి ఉపాధి ఇస్తున్న ఆ రంగం గురించి వివరించారు. కులవృత్తులు కనుమరుగవుతున్న తరుణంలో ముందుచూపుతో చేసే ఇలాంటి చిన్నపాటి పనులతో వచ్చే తరాలకూ వృత్తి ప్రాధాన్యం తెలిసొస్తుందన్నది వారి అంతరంగం..



తమ తండ్రులు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుంటే చూస్తున్న పిల్లలు

ఆలోచించాల్సిన విషయం ఇది..



పరీక్ష పత్రాలను దిద్దుతున్న ఓ ఉపాధ్యాయురాలు ఒక విద్యార్థి రాసిన సమాధానం చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు. 'మీరు ఏం కావాలనుకుంటున్నారు' అనే వ్యాసరచన అంశంపై ఓ విద్యార్థి 'నేను స్మార్ట్‌ఫోన్ అవ్వాలి' అని రాస్తాడు. ఆ విద్యార్థి అమ్మానాన్నలు సెల్‌ఫోన్‌ను చాలా ప్రేమిస్తారు. దానిని శ్రద్ధగా ఇష్టంగా చూసుకుంటారు. నాన్న ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే స్మార్ట్‌ఫోన్ రిలాక్స్ ఇస్తుంది. ముఖ్యమైన పనుల్లో ఉన్నా ఫోన్ రింగ్ అవ్వగానే జవాబు ఇస్తారు. నేను పిలిచినా పట్టించుకోరు.. తల్లిదండ్రుల చరవాణిలోనే నిమగ్నమై [illegible] పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నది ఆ వ్యాసంలోని సారాంశం. ఇది ఎప్పటి నుంచో వైరల్ అవుతోంది. చాలా మంది ఇళ్లలో కనిపించే ఈ అంతరం కనిపిస్తోంది.

జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ విద్యార్థులు



విద్యార్థులతో ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, న్యూస్‌టుడే : అసోం రాష్ట్రంలోని గువహటి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాలోని బాసర నాగభూషణ విద్యాలయం విద్యార్థులు ఎం.చరణ్, డి.అవినాష్‌లు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచి జాతీయస్థాయిలో పాల్గొననున్నారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ముధుల్కర్, యోగా మాస్టర్ మల్లేశ్, స్కూల్ ప్రిన్సిపల్ బాబురావు వైస్ ప్రిన్సిపల్ సులోచన, నేత్ర వైద్యుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు నాందేడ్ నుంచి ఆమ్లాకు ప్రత్యేక రైలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ధమ్మ పరివర్తన దినోత్సవం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని పురస్కరించుకొని శుక్ర, శనివారాలు నాందేడ్-ఆమ్లా-నాందేడ్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ప్రత్యేక రైలు(నెం.07025) నాందేడ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి ముద్ఖేడ్, భోకర్, హిమాయత్‌నగర్, సహస్రకుండ్, కిన్వట్, ఆదిలాబాద్, పిప్పల్‌కుటి, నాగ్‌పూర్, ఆమ్లాకు శనివారం ఉదయం 11 గంటలకు చేరుకుంటుందన్నారు. శనివారం ప్రత్యేక రైలు(నెం.07026) ఆమ్లా నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో అవే స్టేషన్‌ల ద్వారా ఆదివారం ఉదయం నాందేడ్ చేరుకుంటుందన్నారు. ప్రత్యేక రైలులో 17 జనరల్ బోగీలతో కలిపి మొత్తం 19 కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.



కప్పుకొన్న మంచు దుప్పటి

రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం కాస్త ఎండ కాస్తూనే.. మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. రాత్రి వేళ చలి ప్రారంభమై తెల్లవారుజామున మంచు కురుస్తోంది. ఆదిలాబాద్ పట్టణాన్ని గురువారం ఉదయం మంచు కమ్మేసింది. - ఈనాడు, ఆదిలాబాద్

ముఖ్యమంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఆసిఫాబాద్, ఉట్నూరు గ్రామీణం న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరుతూ.. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి వినతిపత్రం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ, చట్టాల అమలు, జైనూర్ ఘటన బాధితురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, సీడీపీ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సత్తు మల్లేష్ తదితరులు ఉన్నారు.



పొలాలకు సాగునీటినందించే ప్రధాన కాలువ

నిండుగా జలాలు.. కళకళలాడుతున్న పొలాలు

● 29 టీఎంసీల నీరు గోదావరి పాలు

కడెం, న్యూస్‌టుడే : కడెం నారాయణరెడ్డి జలాశయం ఆయకట్టు పరిధిలోని ఆరు మండలాల రైతులకు కల్పతరువు. కడెం నిండిందంటే ఆ ప్రాంత రైతుల ఆశలు పండినట్లే. కడెం బాగుండాలని, నిండా నీరుండాలని ఆయకట్టు రైతులు కోరుకుంటుంటారు. ఈ వానాకాలం రైతుల కళలు పండేలా ప్రాజెక్టు ఆశాజనకంగా నిండడమే కాకుండా అదనంగా వచ్చిన నీటిని దిగువకు వదిలారు. అక్టోబరు మొదటి వారం ముగిసినా జలాశయంలో గరిష్ఠ మట్టానికి చేరువగా నీటిమట్టం ఉండటంతో వారబందీ నిబంధనలేవీ పెట్టకుండానే అధికారులు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో కాలువలకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 700.7 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కుల వరకు మాత్రమే వస్తోంది.

ఎదుగుతున్న చేలు

కడెం కాలువల ద్వారా పొలాలకు నిరంతరంగా సాగునీరందుతోంది. ప్రాజెక్టు నిండా జలాలు ఉండటంతో చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. మాకు నీరు రాలేదనే ఆరోపణలేమీ లేకుండా రైతుల పొలాలు ఎదుగుతున్నాయి. కాలువల్లో గలగలా నీరు పారుతుంటే పంట పొలాలు కళకళలాడుతూ ఏపుగా ఎదుగుతున్నాయి. ప్రాజెక్టు కింద మొత్తం 60 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్టు అధికారుల అంచనాగా ఉంది. ప్రధాన కాలువకు ఉన్న 42 ఉపకాలువల ద్వారా పొలాలకు సాగునీరందుతోంది. పొలాలన్నీ పొట్ట దశలో ఉండగా మరికొన్ని పొలాలు గొలకలు వేస్తున్నాయి. అక్కడక్కడ తెగుళ్లు సోకిన పొలాలకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటూనే దిగుబడిపై ఆశలు పెంచుకుంటున్నారు.

నాలుగింతల నీరు గోదావరికి..

కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు. ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి కడెంకు మొత్తం 41 టీఎంసీల వరదనీరొచ్చింది. అందులోంచి వరద గేట్ల ద్వారా 29.088 టీఎంసీల నీటిని గోదావరికి వదిలారు. అంటే సుమారు కడెంలో నిల్వ ఉండే నీటికి నాలుగింతల నీరు గోదావరికి వదిలారన్నమాట. కాలువలకు ఇతరత్రా 4.8 టీఎంసీల నీటిని విడుదల చేశారు ప్రస్తుతం కడెంలో 7.511 టీఎంసీల నీరుంది. గతేడాదికంటే ఇపుడు నీటిమట్టం ఆశాజనకంగానే ఉండటంతో వానాకాలం పంట పూర్తయ్యాక రెండో పంటకూ సగం ఆయకట్టుకైనా నీరందుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



కడెం కింద సాగవుతున్న పొలాలు

విరుల పండగ.. లాభాలు దండిగా..

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం



ఎకరం తోటలో పది టన్నులకు పైగానే..

ప్రకృతిని, పూలను దేవతలుగా కొలుస్తూ పల్లె, పట్నం అనే తేడా లేకుండా.. కొనసాగే పండగ బతుకమ్మ. రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, మహిళలు ఒక చోట చేరి ఆటపాటలతో సాగుతుంది. మరో వైపు వరుసగా దసరా, దీపావళి, ఆ తర్వాత కార్తికమాసం పూజలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో ఈ నెల నుంచి మరో రెండు నెలల పాటు పూలకు డిమాండ్ బాగా ఉంటుంది. బంతి, చామంతి కిలో రూ.100 వరకు ఉన్నాయి. పండగలు, శుభకార్యాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొంత మంది రైతులు పూలను సాగు చేసి లాభాలను గడిస్తున్నారు. ఇతర రైతులకు భిన్నంగా పూల సాగుకు ప్రత్యేకంగా కొంత భూమిని కేటాయించడంతో పాటు సీజన్ల వారీగా పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పూల తోటలు సాగు చేసే రైతులు లాభాలు గడిస్తున్నారు. ఎకరం భూమిలో బంతి పూల సాగుకు రూ.40 వేలు పెట్టుబడి అవుతుండగా, పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. సీజన్‌లో కిలో రూ.100కు పైగా ధర ఉంటుంది. రైతులు రోజు వారీగా పూలు తెంపి స్థానిక మార్కెట్లో విక్రయిస్తే లాభం ఉంటుంది. టోకులో విక్రయిస్తే కిలో ధర రూ.60 ఉంటుంది. డిమాండ్‌ను బట్టి పండగల సమయంలో ధర ఇంకా ఎక్కువే ఉంటుంది. జిల్లాల వారీగా పూలు సాగు చేసే రైతులు తక్కువ సంఖ్యలో ఉండటంతో స్థానిక మార్కెట్లో విక్రయిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు.



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన రైతు శ్రీకాంత్ బంతి పూలు సాగు చేస్తున్నారు. పూల డిమాండ్‌ను బట్టి దిగుబడి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకొని సాగు చేయడం వల్ల ఆశించిన లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక మార్కెట్లో విక్రయించేలా ఏర్పాట్లు చేసుకొని అధిక లాభం పొందుతున్నారు.

● తక్కువ ఖర్చు.. రోజువారీ ఆదాయం



☛ కుమురం భీం జిల్లా దహెగాం మండలం పి.పి.రావు కాలనీకి చెందిన రైతు సురేష్ మల్చింగ్ పద్ధతిలో పూల సాగు చేస్తున్నాడు. ఎకరం భూమిలో రెండు రకాల బంతి పూలు సాగు చేస్తున్నారు. సరిగ్గా బతుకమ్మ పండగ వచ్చేసరికి దిగుబడి వచ్చేలా చూసుకుంటారు. ఎకరానికి పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. పూలను విక్రయించడానికి ఎక్కడికి వెళ్లే అవసరం లేదు. తోట దగ్గరికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారని వివరించారు.



☛ ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారికి చెందిన రైతు దేవిదాస్ తనకు ఉన్న భూమిలో రెండు ఎకరాల్లో కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ పండగ సమయంలో పూలకు ఎక్కువ డిమాండ్ ఉండటం, పైగా ఆదిలాబాద్ జిల్లాలో ఈ పండగ నెల రోజులు కొనసాగుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా దిగుబడి వచ్చేలా వారం రోజుల తేడాతో విత్తుకోవడంతో రోజు వారీగా పూల విక్రయాలుండటంతో లాభాలు గడించే అవకాశం ఉందని దేవిదాస్ తెలిపారు.



☛ నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లికి చెందిన ఆర్.మహేశ్ ఎకరం భూమిలో పూలు సాగు చేస్తున్నాడు. బతుకమ్మ పండగ సమయానికి బంతిపూలు వచ్చేలా జూన్ నెలలో పంట సాగును ప్రారంభిస్తే.. సెప్టెంబరు నుంచి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. చాలా మంది చేను దగ్గరికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారని, ఎక్కువ దిగుబడి వస్తే.. నిజామాబాద్ మార్కెట్లో విక్రయిస్తామని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పూల సాగు(ఎకరాల్లో)



బంతి : 258 | చామంతి : 115 | మల్లె : 68 | లిల్లి : 52


అల్లుడి మరణం తట్టుకోలేక.. అత్త హఠాన్మరణం



వచ్చలబాయి

భీంపూర్, న్యూస్‌టుడే : రెండు రోజుల కిందటే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆ మరణం తట్టుకోలేక అత్త హఠాన్మరణం చెందిన ఘటన కరంజి-టిలో విషాదం నింపింది. రెండు రోజుల వ్యవధిలో ఒకే ఇంట ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నిండింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గ్రామానికి చెందిన కర్నెవార్ గణేష్ మంగళవారం మృతి చెందిన సంగతి తెలిసిందే. భార్య కవిత తల్లి వచ్చలబాయి(75) భర్త చనిపోవడంతో ఏళ్లుగా కూతురు-అల్లుడి ఇంట్లో ఉంటోంది. అల్లుడి మరణంతో కూతురు, ఆమె పిల్లల భవితవ్యంఎలాగోనని రెండు రోజులుగా రోధిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కూర్చున్న చోటనే కుప్పకూలి చనిపోయింది.

ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్‌గా శేఖర్



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఛైర్మన్‌గా నిర్మల్ పట్టణానికి చెందిన కొట్టె శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘ బలోపేతానికి కృషిచేస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:

? : క్యాతనపల్లి పుర పరిధి ఒకటో వార్డు తారకరామ కాలనీలోని కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగు పారడం లేదు. దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల బారిన పడుతున్నాం. - స్థానికుడు, 1వ వార్డు, క్యాతనపల్లి

✔ కాలువలో పూడిక తీయిస్తాం. పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - ప్రదీప్ కుమార్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, క్యాతనపల్లి

? రామకృష్ణాపూర్ పట్టణంలోని స్థానిక రామాలయం చౌరస్తాలో కాలువ నుంచి మురుగు పారడం లేదు. కాలువ నిండి మురుగు రహదారిపై ప్రవహిస్తుంది. ప్రయాణాల కోసం వచ్చే వారికి దుర్వాసనతో అవస్థలు తప్పడం లేదు. - స్థానికులు, రామాలయం చౌరస్తా, క్యాతనపల్లి

✔ సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - శ్రీధర్, సివిల్ డివిజన్ ఈఈ, రామకృష్ణాపూర్

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? మంచిర్యాలలోని సూర్యనగర్ రోడ్డు నెం.1లో మురుగు కాలువ నిండిపోవడంతో దుర్వాసన వస్తోంది. ఆ కాలువ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. -సూర్యనగర్ కాలనీవాసులు, మంచిర్యాల

✔ మూడు రోజుల్లో కాలువ శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగిస్తాం. - ఉదయ్ కిరణ్, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారి, మంచిర్యాల

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నవీన్

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి దీపక్‌నగర్‌లో ఉంటున్న నవీన్(35) అనే యువకుడు గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. డిగ్రీ వరకు చదువుకున్న నవీన్ కారు డ్రైవర్‌గా పని చేశారు. ఆ తర్వాత వ్యాపారం ప్రారంభించినా రాణించలేకపోయారు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే వంతెన సమీపంలో గురువారం కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి(45) మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడు కుడిచేతిపైన రమేశ్ అని హిందీ అక్షరాలు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరించిన నిందితుడికి రిమాండ్

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం మండలం దేవునిగూడ గ్రామంలో ఈ నెల 8న మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరించిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. జన్నారం ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది లావణ్య జన్నారం మండలం దేవునిగూడలో నిర్వహించిన శుభకార్యానికి వచ్చారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి లావణ్య మెడలోని రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అపహరించిన రేండ్లగూడ గ్రామానికి చెందిన బొర్లకుంట రాజేందర్‌ను గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎస్సై-2 తానాజీ, హెడ్ కానిస్టేబుల్ తుకారాం, సురేశ్ ఉన్నారు.

కిలో గంజాయి పట్టివేత: ఐదుగురి అరెస్టు

తాండూరు, న్యూస్‌టుడే: గంజాయిని అక్రమ రవాణా చేస్తూ క్రయవిక్రయాలు చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తాండూరు సర్కిల్ సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం మాదారం టౌన్‌షిప్ శివారులో కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాం గ్రామానికి చెందిన కొందరు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో మాదారం ఎస్సై సౌజన్య దాడులు నిర్వహించారు. ఈస్గాంకు చెందిన విజయ్‌హల్దార్, రాజ్‌కుమార్, తాండూరుకు చెందిన షేక్‌హుసేన్, గొల్లపల్లి సందీప్, బండారి శ్యాంలు పట్టుబడ్డారు. వారి నుంచి 1.100 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తాండూరు ఎస్సై కిరణ్‌కుమార్, మాదారం ఎస్సై సౌజన్య పాల్గొన్నారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం..

కన్నెపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపూర్ క్రాస్ వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల రాయితీ రేషన్ బియ్యాన్ని కన్నెపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై గంగారం తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ జావిద్ అనే వ్యక్తి సుర్జాపూర్ గ్రామంలోని బందారి లక్ష్మణ్ వద్ద కొనుగోలు చేసిన రాయితీ రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

జూదరుల అరెస్టు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: స్థానిక కాలేజీరోడ్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం రాత్రి ఇంటిపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.73,470 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలో బుధవారం రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పాతమంచిర్యాలకు చెందిన దొడ్డిపట్ల స్వామి(49)గా గుర్తించినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడు కొద్దిరోజులుగా అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలయ నిర్మాణానికి సామగ్రి వితరణ

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు గ్రామ పంచాయతీ పరిధి పెద్ద చెరువు కట్టపై ఉన్న వాంద పోచమ్మ ఆలయ నిర్మాణానికి బద్ది మాధవ్ దేవ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్క రాంచందర్ రూ.21 వేల విలువ చేసే సామగ్రిని అందించారు. రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు దత్తాత్రేయరావు, గ్రామస్థులు నవీన్, మల్లేశ్, బాపు, లచ్చన్న, బెల్లాల పాల్గొన్నారు.

నాలుగు నిమిషాలు.. నాలుగింటిని ప్రయత్నించి..

★ చివరికి ఓ వాహనం ఎత్తుకెళ్లిన దుండగులు

ఇద్దరు వ్యక్తులు ఓ వాహనాన్ని ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం రాత్రి జీజీహెచ్‌లో చోటు చేసుకుంది. నాలుగు నిమిషాల వ్యవధిలో ఇక్కడి పార్కింగ్‌లో వారి దగ్గర ఉన్న తాళం చెవితో నాలుగింటిని ప్రయత్నించారు. చివరకు ఒకటి వాహనం కావడంతో ఎత్తుకెళ్లిపోయారు. అన్నిసార్లు పలు వాహనాలను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్నా ఎవరూ పసిగట్టకపోవడం విశేషం. ఈ వ్యవహారమంతా గురువారం ఆ వాహన బాధితుడు, ఆసుపత్రి పర్యవేక్షకుల సహాయంతో సీసీ కెమెరాలను చూడగా బయటపడింది. అనంతరం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. - న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ


ద్విచక్రవాహనం చోరీ చేస్తున్న దుండగుడు

అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు


మంచిర్యాల : రాముని చెరువులో బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న మహిళలు


బెల్లంపల్లి వాసవి ఆలయంలో... ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్వేత


చెన్నూరులోని జగన్నాథ ఆలయం వద్ద..


భీమిని మండలం జగ్గయ్యపేట గ్రామంలో..

సద్దుల బతుకమ్మను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వివిధ పూలతో బతుకమ్మలు పేర్చి కూడళ్ల వద్ద పాటలు పాడుతూ ఆటలు ఆడి కోలాటాలతో సందడి చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి స్థానిక వాగుల్లో నిమజ్జనం చేశారు. సింగపూర్, అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రాల్లో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకున్నట్లు జిల్లాకు చెందిన సాయబోయిన రజిత(సింగపూర్), గోగు ఆశ్రిత(అమెరికా) 'న్యూస్‌టుడే'కు తెలిపారు. - న్యూస్‌టుడే, బృందం


గుడిపేట బెటాలియన్‌లో..


సింగపూర్‌లో నిర్వహించిన సంబరాల్లో..


నస్పూర్ అభినవ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బెల్లంపల్లిలో బతుకమ్మతో చిన్నారి


లక్షెట్టిపేటలోని గోదావరి రోడ్డులో దుర్గాదేవి మండపం వద్ద ..


మందమర్రిలో...


బతుకమ్మలను ఎత్తుకున్న యువతులు


క్యాతనపల్లిలో..

ఓటరు జాబితా రూపకల్పనకు కృషి

ఏసీసీ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా స్పష్టమైన జాబితా రూపకల్పనకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు అధికారుల సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పలు పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 29న ముసాయిదా జాబితా విడుదల, నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 24న ఫిర్యాదుల పరిశీలన తర్వాత జనవరి 6న తుది జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నవంబరు 6 వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటుహక్కు నమోదుకు అవకాశం ఉందన్నారు. నవంబరు 23న ఎమ్మెల్సీ ముసాయిదా జాబితా, డిసెంబరు 30న తుది జాబితా విడుదల చేస్తామన్నారు.

గత పాలకుల హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యం: ఎమ్మెల్యే

చెన్నూరు, న్యూస్‌టుడే: గత పదేళ్ల పాలనలో పాలకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం పని చేశారే తప్ప వారి హయంలో చెన్నూరులో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. చెన్నూరు పట్టణంలోని 4వ వార్డులో రూ.62.90 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ చెన్నూరుతోపాటు నియోజకవర్గంలోని మందమర్రి, రామకృష్ణాపూర్ బల్దియాల్లో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో ప్రాంత రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూశారన్నారు. వారి సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. పంట నష్టంపై సర్వేకు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. చెన్నూరులో తాగునీటి ఎద్దడిని దూరం చేసేందుకు ఇప్పటికే రూ.30 కోట్లతో పనులు చేపట్టామన్నారు. సొంత నిధులతో బోర్లు వేయించినట్లు గుర్తు చేశారు. రూ.125 కోట్లతో సమీకృత పాఠశాలకు గురువారం శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించానన్నారు. త్వరలో నేతకానీ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. చెన్నూరులో వంద పడకల ఆసుపత్రిని త్వరగా మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మందమర్రిలో ఆసుపత్రి ఏర్పాటుకు మంత్రులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. వార్డు పరిధిలో మురుగుకాలువలు, రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు పాలనాధికారి కుమార్‌దీపక్ తెలిపారు.


చెన్నూరు 4వ వార్డులో చేపట్టే అభివృద్ధి పనులకు పాలనాధికారి, పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్ : క్యాతనపల్లి పురపరిధిలో ఎమ్మెల్యే వివేక్ పర్యటించారు. పట్టణంలోని దుర్గామాత ఆలయాలను సందర్శించారు. దుర్గామాతలకు పూజలు చేశారు. ఠాగూర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

పోలీసు విధులు నిర్వర్తిస్తూ..
గణిత ఉపాధ్యాయుడిగా ఎంపిక


ముస్కె శిరీష్

ఆత్మవిశ్వాసం పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపించాడు దండేపల్లికి చెందిన ముస్కె శిరీష్. పదేళ్ల కిందట పోలీసు ఉద్యోగంలో చేరినా.. ఉపాధ్యాయ వృత్తి పట్ల మక్కువతో డీఎస్సీ రాసి గణిత ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యాడు. ముస్కె మల్లేశ్, విజయ దంపతుల కుమారుడు పది వరకు స్థానిక భారతీ విద్యానికేతన్, ఉన్నత పాఠశాలలో చదివాడు. ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ అనంతరం బీఈడీ చేశాడు. 2012లో నిర్వహించిన డీఎస్సీ రాయగా ఉద్యోగం రాలేదు. ఆ తర్వాత 2012లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. వివాహమై ఇద్దరు పిల్లలున్నా.. ఉపాధ్యాయ వృత్తిపట్ల ఉన్న ఆసక్తితో కష్టపడి డీఎస్సీ(గణితం స్కూల్ అసిస్టెంటు) రాశారు. 75.47 మార్కులతో జిల్లాలో ఆరో ర్యాంకు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రారంభంలో డీఎస్సీ రాకపోవడంతో బాధ అనిపించిందని, ఉపాధ్యాయ ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడి కొలువు సాధించడం ఆనందంగా ఉందని శిరీష్ చెప్పారు.

- న్యూస్‌టుడే, దండేపల్లి


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

శ్రీరాంపూర్ సింగరేణికి తలమానికం

నస్పూర్, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియా సింగరేణికి తలమానికం అని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 'ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర'పై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించడం, నాణ్యతా ప్రమాణాలు పాటించడం, సంక్షేమం, సంస్థ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల్సిన అంశాలపై చర్చించారు. బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం కాకుండా పోరాడుతామని పేర్కొన్నారు. 2023-24 ఏడాదిలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లు, సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్‌గా అందించామని గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ చరిత్రలో తొలిసారి ఈ ఏడాది కాంట్రాక్టు కార్మికులకు లాభాల బోనస్ రూ.5 వేలు చెల్లించామని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తామని జీఎం సంజీవరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీనివాస్, బాజీ సైదా, వీరభద్రయ్య పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో మెరుగైన వైద్యం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ప్రజల కోసం నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఐబీ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల చేతుల మీదుగా ఆసుపత్రి శంకుస్థాపన ఉంటుందన్నారు.

1,500 మంది మహిళలకు చీరల పంపిణీ

తాండూరు, న్యూస్‌టుడే: మండల పరిధి తాండూరు గ్రామ పంచాయతీలోని ఆడపడుచులకు మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్ చీరలను పంపిణీ చేశారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని సొంత డబ్బులతో సుమారు 1,500 మంది మహిళలకు చీరలు అందజేశారు. సంతోష్, సమ్మయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇక్కడ కనిపిస్తున్న గ్రామం కోటపల్లి మండలంలోని రాజారం పంచాయతీలోని కొత్తపల్లి. పంచాయతీలో నిధులు లేకపోవడంతో కొంత కాలంగా వీధి దీపాల నిర్వహణ లేక ప్రజలు చీకట్లో మగ్గుతున్నారు. స్థానిక కార్యదర్శి తనవంతుగా కొన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో దీపాల సౌకర్యం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.




నర్సరీల నిర్వహణ భారాన్ని మోయడం తమవల్ల కాదంటూ డీఆర్‌డీఓ కిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న వీరంతా కోటపల్లి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు. నర్సరీల నిర్వహణలో తలెత్తే ఆర్థిక ఇబ్బందులను వివరిస్తూ సంబంధిత బాధ్యతలను ఈజీఎస్ సిబ్బందికి అప్పగించాలని పేర్కొన్నారు.

నర్సరీల భారం.. మోయలేక సతమతం

కోటపల్లి, న్యూస్‌టుడే:

సర్పంచుల పదవీకాలం ముగిసిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేకాధికారులకు పాలన అప్పగించినప్పటి నుంచి పల్లెలకు నిధుల కొరత వెక్కిరిస్తోంది. సుమారు 15 నెలల నుంచి రాష్ట్రం ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో సంబంధిత కార్యదర్శులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కొద్దిపాటి నిధులతో అరకొరగా సౌకర్యాలను కల్పిస్తూ పంచాయతీలను నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం రాబోయే ఆర్థిక సంవత్సరానికి(2024-25) సంబంధించి నర్సరీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇక వాటి నిర్వహణ తమవల్ల కాదని కార్యదర్శులు గగ్గోలు పెడుతున్నారు. గతేడాది చేసిన పనులకే బిల్లులు రాక అప్పుల ఊబిలో చిక్కుకుపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో చిల్లిగవ్వ లేకపోవడంతో మౌలిక వసతులు కొరవడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యేకాధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో కార్యదర్శులే భారం మోస్తూ పాలన నెట్టుకొస్తున్నారు. ఇలాంటి విపత్కర సమయంలో గ్రామాల్లో నర్సరీలను స్థాపించాలంటూ ప్రభుత్వం ఆదేశించడంతో మరోమారు పెట్టుబడి ఎక్కడి నుంచి తీసుకు రావాలంటూ తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేయాలంటే ఆయా పంచాయతీలకు కేటాయించిన మొక్కల లక్ష్యం ఆధారంగా నీటి వసతి ఉన్న స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎర్రమట్టితో పాటు ఇసుక, ఎరువు, ప్రైమరీ బెడ్స్ కొరకు సిమెంట్ రింగులు, విత్తనాలు, గ్రీన్ షెడ్ నెట్, చుట్టూ కంచె తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంటుంది. సంబంధిత సామగ్రి ఖర్చులను మొదట కార్యదర్శులే మోయాల్సి వస్తోంది. మరోవైపు పంచాయతీ ట్రాక్టర్లకు సంబంధించి ఈఎమ్ఐలు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. వీధి దీపాలు, విద్యుత్తు మోటార్లకు చెల్లించే బిల్లులు, దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ మిషన్ల మరమ్మతులు, నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ ఖర్చులు భరించడం వారికి తలకు మించిన భారంగా మారుతోంది. మరోవైపు ఓపీఎస్‌లకు అందే అరకొర వేతనాలు గత 6 నెలలుగా చేతికందకపోవడంతో అప్పులు తీసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పండగకు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడింది.



నేడు కార్మికులకు విందు

మందమర్రి పట్టణం: మందమర్రి ఏరియా సింగరేణి బొగ్గు గనులపై సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు, ఉద్యోగులకు విందు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జీఎం దేవేందర్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ విందుకు ముందు, అనంతరం సింగరేణిలో వాస్తవ పరిస్థితులు, భవిష్యత్తు వ్యాపార విస్తరణ, లక్ష్యాలను అధిగమించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

'గనులపై భోజనాలు వ్యతిరేకిస్తున్నాం'

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థ నిధులను దుర్వినియోగం చేస్తూ యాజమాన్యం గనులపై సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ కార్మిక సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.33 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

బెల్లంపల్లి గ్రామీణం, కాసిపేట: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని ఓ సర్వే నెంబరులో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకోకుండా గురువారం మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారి-363ని ఆనుకుని ఉండటంతో పాటు తరచూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆకెనపల్లి శివారుల్లోని-3లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.


ఆకెనపల్లి శివారులో బోర్డు పాతిన రెవెన్యూ సిబ్బంది

సంక్షిప్త సమాచారం

ఉద్యోగుల చేతుల్లో సంస్థ భవిష్యత్తు

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి ఉద్యోగుల చేతుల్లో సంస్థ భవిష్యత్తు ఆధారపడి ఉందని సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం రవీంద్రఖని-5 గని వద్ద మాట్లాడుతూ సంస్థ స్థితిగతులపై ఉద్యోగులకు అవగాహన ఉండాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని ఆర్కే-4 గడ్డ శాంతినగర్‌కు చెందిన జె.సురేష్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఆత్మీయ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల విలువైన చెక్కును గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

17లోగా బెల్లంపల్లి పీజీ కళాశాలలో చేరాలి

బెల్లంపల్లి పట్టణం: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ కోర్సుల్లో రెండో విడతలో చేరిన విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోగా బెల్లంపల్లి కళాశాలలో చేరాలని ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్, పీజీ కో-ఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు. ఎంఏ(ఇంగ్లీష్), ఎం.కామ్ కోర్సుల్లో రెండో విడతలో విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు చెప్పారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని కల్మలపేట గ్రామంలో గురువారం దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజరు శివశంకర్ ఆధ్వర్యంలో ఆర్థిక లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళాజాత బృందంతో పాటల ద్వారా వివరించారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రసాద్

చెన్నూరు, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా చెన్నూరు పట్టణానికి చెందిన ఎన్‌పీవాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.కే. ప్రసాద్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర 35వ కౌన్సిల్ సమావేశంలో జిల్లా నుంచి ఆయనకు అవకాశం దక్కింది.


ఆర్.కే.ప్రసాద్

మహిళలకు డీజే బాక్సుల అందజేత

వేమనపల్లి: మండలంలోని వేమనపల్లి, నీల్వాయి గ్రామాల మహిళలకు రూ.11 లక్షలు విలువ చేసే 40 డీజే బాక్సులను గురువారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్ అలీ అందజేశారు.